
# ఆంటీ!....

మన భారదేశంలో... తొట్ట తొలిసారిగా "అంటీ!... " అని పిలవడం ఎవరు చేశారోగానీ వాళ్ళు ఎవరో తెలిస్తే... యావత్ భారద్దేశంలోని మహిళలు "థూ... నీ జిమ్మడ... నువ్వు పురుగులుపడ, నీ కడుపుడక, దొంగ సచ్చినోడు, ముదనష్టపోడు..." అంటూ ఇంకా చాలాచాలా పదాలు రకరకాల భాషల్లో అతన్ని తల్చుకుంటూ తల్చుకుంటూ తిట్టుకునేవారు.




ఎందుకంటే... ఆంటీ అని అందరూ పిలుస్తారు... కానీ ఎందుకో ఆ పదం అంటే అందరికీ ఎలర్జీనే!!....

అమ్మా అని పిలిస్తే ఏ మాతృమూర్తి హృదయమైనా సంతోషంతో పొంగిపోతుంది. చెల్లీ అని పిలిస్తే ఆ చెల్లెలు అన్నయ్య ఆత్మీయతకు కరిగిపోతుంది. అక్కా అని పిలిస్తే ఆ అక్క తమ్ముడి మీద మమకారాన్ని కురిపిస్తుంది. అత్తయ్యా అని పిలిస్తే కోడలి అభిమానానికి ఆ అత్తయ్య మురిసి ముక్కలవుతుంది.

కానీ ఆంటీ అని పిలిస్తే, ఆ పిలిపించుకోబడ్డ స్త్రీ మాత్రం కృంగిపోతుంది. ఎందుకు?...ఎందుకు??... ఎందుకు???...

ఎందుకో మీనాక్షిని ఒక్కదాన్ని చూస్తే చాలు... మనకి అర్థం అయిపోతుంది. మరి మనం మీనాక్షి దగ్గరికి పోదామా?...

మీనాక్షి పెరట్లో తులసి కోట చుట్టూ ప్రదక్షిణాలు చేసి ఇంట్లోకి వెళ్ళబోయింది.
కానీ అప్పుడే ఎవరో పిలిచారు... "ఆంటీ" అని.
మీనాక్షి ఠక్కున ఆగి వెనక్కి తిరిగి చూడబోయింది. కానీ అంతలోనే ఆ పిలిచింది తనని కాదనే నిర్ణయానికి వచ్చింది. కారణం... మీనాక్షికి వయసు ఇరవై ఏళ్ళు ఉంటాయ్
ఆ పిలిచిన వాళ్ళ గొంతు చిన్న పిల్లల గొంతులా లేదు... అది పెద్దవాళ్ళ గొంతులాగానే ఉంది.
కాబట్టి ఆంటీ అని పిలిచింది తనని కాదని మీనాక్షి వెనక్కి తిరిగి చూడకుండా రెండడుగులు ముందుకేసింది.
"ఆంటీ... ఆంటీ... ఆంటీ..." కంగారుగా పిలిచింది ఆ గొంతు.
మీనాక్షికి డవుటొచ్చేసింది. వెనక్కి తిరిగి చూసింది.
వెనకింటి ఆవిడ చెల్లెలు... రేఖ! గోడమీది నుండి చూస్తూ మీనాక్షిని చూసి నవ్వింది.
మీనాక్షికి అర్థం అయిపోయింది. రేఖ తననే పిలిచిందని. అంతే ... ఆమెకి చచ్చేంత కోపం వచ్చేసింది. ఎందుకంటే...
మీనాక్షి కంటే రేఖ రెండేళ్ళు పెద్దది. మీనాక్షి వయసు ఇరవై సంవత్సరాలైతే, రేఖ వయసు ఇరవై రెండు సంవత్సరాలు.
మరి తనకంటే చిన్నదయిన మీనాక్షిని రేఖ ఆంటీ అని ఎందుకు పిలిచింది?
వెరీ సింపుల్ రేఖకి పెళ్ళి కాలేదు... ఇంకా చదువుకుంటూంది. మీనాక్షికి పెళ్ళి అయిపోయి, సంవత్సరం వయస్సున్న బాబు కూడా ఉన్నాడు.
మీనాక్షి వెనక్కి తిరిగి గోడవైపు అడుగులు వేసింది. ఆమె మనసు భగభగా మండసాగింది.
"ఎద్దులా ఉంది... పెళ్ళికానంత మాత్రాన చిన్నపిల్లా... నాకంటే పెద్దది నన్ను ఆంటీ అంటుందేమిటి?..." అనుకుంటూ రేఖ పీకుచ్చుకుని గట్టిగా ఊపేస్తూ మాడు మీద రెండు గుద్దులు గుద్దినట్టు ఊహించుకుంది కసిగా మీనాక్షి.
ఆ ఊహ మీనాక్షికి చాలా ఆనందాన్ని కలిగించి పకపకా నవ్వుకుంటూ గోడ దగ్గరికి చేరుకుంది.
"ఏంటి ఆంటీ, అంత సంతోషంగా ఉన్నావ్?" అడిగింది రేఖ.
"ఏముందీ... పీకుచ్చుకుని గట్టిగా ఊపి మాడుమీద గుద్దానన్నమాట!..."

అంది మీనాక్షి కసిగా.
"బాబోయ్! ... ఎవర్ని? బావగార్నే??" ఆశ్చర్యంగా అడిగింది రేఖ.
"అబ్బే... ఎవర్నీ కాదు... నా శత్రువు ఒకమ్మాయ్ ఉంది... దాన్ని మనసులోనే ఊహించుకుని ఆ పని చేశానన్నమాట ... సరేగానీ ఎందుకు పిలిచావ్?..."
"మా అక్కయ్య కరివేపాకు రెండు రెబ్బలు ఇమ్మని అడగమంది ఆంటీ!" అంది రేఖ.
మీనాక్షి పెరట్లోని కరివేపాకు చెట్టునుండి తట్టెడు కరివేపాకు కోసి ఇచ్చింది.
"అదేంటి ఆంటీ, రెండు రెబ్బలు అడిగితే ఇంతిచ్చారు?" అంది రేఖ ఆశ్చర్యంగా.
"మళ్ళీ రేపు నువ్వు గోడమీంచి నన్ను ఆంటీ ఆంటీ అని పిలవకుండా వారానికి సరిపడా ఇచ్చా..." అని వెనక్కి తిరిగి వెళ్ళిపోతూ "కరివేపాకుతో బాటు కాస్త విషం వేసి చారు కాచమని మీ అక్కకి చెప్పు... పీడా వదిలిపోతుంది. ..." అంది సణుగుతూ
"ఏంటాంటీ?... కరివేపాకుతో బాటు ఇంకా ఏంటి చెయ్యమంటారూ?..." అడిగింది రేఖ.
"ఏంలేదు... కాస్త ఇంగువ వెయ్యమన్నా..." అనేసి విసవిసా యింట్లోకి వెళ్ళిపోయింది మీనాక్షి.
ఇంట్లోకి వెళ్ళగానే ఎదురొచ్చిన భర్త కాంతారావ్ గుండెలమీద తలవాల్చేసి ఆయన మెడని గట్టిగా కావలించుకుని వలవలా ఏడ్చేసింది.
"ఏంటే... ఏమైంది... మీ అమ్మ గానీ టపా కట్టేసిందా?" అని అడిగాడు కాంతారావ్.
"మీరెప్పుడూ మావాళ్ళు ఎవరు టపా కట్టేస్తారా అని ఎదురు చూస్తారు... హు..." అంటూ కాంతారావ్ టెంకిమీద ఒకటిచ్చింది వెక్కుతూ
"ఇదిగో, అలాగైతే నా గుండెల మీద వాలనివ్వనంతే ... ఆ..." అని బెదిరించి "ఇంతకీ ఎందుకేడుస్తున్నావ్?" అన్నాడు.
"అది లేదూ... ఆ రేఖ... నన్ను ఆంటీ అని పిలిచిందండీ..." అంటూ భోరుమని ఏడ్చింది.
అలా రెండు నిముషాలు బోరుమన్నాక "పోనీ అది పెళ్ళికానిదీ నేను పెళ్ళయిన దాన్నీ... దానికి పిల్లలు లేరూ నాకున్నారూ కాబట్టి కనీసం నన్ను అక్కయ్యా అనైనా పిలవొచ్చుకదా? మరీ ఆంటీ ఏంటండి... "

కుమిలిపోతూ అంది.
"సర్లేసర్లే... నేను ఆ రేఖతో మాట్లాడ్తాలే... నువ్వూర్కో..." వీపు నిమిరాడు కాంతారావ్.
"ఏం అక్కర్లేదు... ఆ సాకుతో దానికి లైనేద్దామనా?... హమ్మా!!" అరిచింది. మీనాక్షి.
కాంతారావ్ వెనక్కి తూలాడు.
"చూశారా? చూశారా??... దానిపేరు చెప్పగానే మీకు మైకం కమ్మేసి ఎలా తూలిపోతున్నారో?" ఉక్రోషంగా అంది మీనాక్షి.
"మైకమా పాడా? ... నీ బరువంతా నా ఛాతీమీద ఇంతసేపు వేస్తే నేను బ్యాలెన్స్ చేస్కోవాలా వద్దా?..." అంటూనే వెల్లకితలా పడిపోయాడు కాంతారావ్.
కాంతారావ్‌ని ఆఫీసుకు పంపించి వంటిల్లు సర్దుకుంటున్న మీనాక్షికి డోర్ బెల్ మోగిన శబ్దం వినిపించి బయటికి వచ్చి తలుపు తీసింది.
ఎదురుగా చింపిరి జుట్టుతో లాండ్రీవాడి పన్నెండేళ్ళ కూతురు ఉంది.
"ఆంటీ... సీరలేమైనా ఇస్త్రీ సెయ్యడానికున్నాయేమో మా అయ్య కనుక్కొని రమ్మన్నాడు " అంది అది.
అది 'ఆంటీ' అని పిలిచేసరికి మీనాక్షి ముందు ఉలిక్కిపడినా తరువాత చాలా సంతోషించింది. ఎందుకంటే తనకంటే బాగా చిన్నదే తనని ఆంటీ అని పిలిచింది. ... ఆ లాండ్రీవాడి పెళ్ళాం వచ్చి ఆంటీ అని పిలవలేదు... అది నయమే కదా?
ఆ సంతోషంతో భళ్ళుమని నవ్వేసింది. "ప్రస్తుతానికి చీరలేమి లేవే... నువ్వెళ్ళు..." అని దాన్ని పంపించేసింది.
మీనాక్షికి బజార్లో చిన్న షాపింగ్ పని ఉంది. అందుచేత బాబుని చూస్కోమని అత్తగారికి చెప్పి సంచి తీస్కొని బజారుకి వెళ్ళింది.
సాయంత్రం కూర చెయ్యడానికి యింట్లో అస్సలు కూరగాయలు లేవు ... అందుకని అవి కొనడానికి మొదట కూరల మార్కెట్టుకి వెళ్ళింది.
"ఆంటీ..." అని వెనకనుండి పిలుపు వినిపించింది.
తనని కాదులే అని ముందుకు వెళ్ళబోయింది. కానీ "ఓ... నిన్నే... ఎర్ర చీరాంటీ..." అని వినిపించింది.
అప్పుడు మీనాక్షి ఎర్ర చీర కట్టుకుని ఉంది. చటుక్కున వెనక్కి తిరిగి చూసింది మీనాక్షి.
ఓ కూరలమ్మే ఆమె చెయ్యూపి మీనాక్షిని పిలుస్తూంది.

మీనాక్షికి చాలా దుఃఖం వచ్చింది. తనకంటే పెద్దది తనని 'అంటీ' అని పిలుస్తుంది. ఆమె బాధ తనకంటే వయసులో పెద్దదయిన ఆమె అంటీ అని పిలుస్తుందని కానీ, ఒక కూరలమ్మేది తనని అంటీ అని పిలుస్తుందని కాదు.

నన్ను ఆంటీ అని పిలిచే దీని దగ్గర కూరలెందుకు కొనాలి? అని అనుకుని దాన్ని చూడనట్టుగా కాస్త ముందు కెళ్ళింది.

"అంటీ ... ఈడ కూరలు శానా ఫ్రెష్‌గా ఉన్నాయ్ ... దా ... దాదా..." అని పిలుపు వినిపించింది.

మీనాక్షి తలత్రిప్పి చూసింది.

ఆ కూరలమ్మేది ఇందాకటి దాని కంటే పెద్దది.

"ఈ దొంగ ముండ దగ్గర అసలు కొనకూడదు" అని అనుకుంటూ చరచరా ముందుకు వెళ్ళిపోయింది.

అలా కాస్త ముందుకెళ్ళి ఒక అవ్వ దగ్గర ఆగింది.

ఆ అవ్వ మీనాక్షిని చూసి బోసి నవ్వు నవ్వింది. "కూరల్ తీస్కోమ్మా... మంచిగున్నాయ్ " అంది.

మీనాక్షి సంతోషంతో చెవుల్దాకా నవ్వింది.

హమ్మయ్య... దీని దగ్గర కూరలు కొనొచ్చు అనుకుంది.

ముందుగా అర కిలో టమాటాలు కొంది. తర్వాత కిలో బంగాళాదుంపలు కొంది. ఇంకా వంకాయలు, బీరకాయలు కొంది.

"ఎంతైంది?" అడిగింది మీనాక్షి.

"బెండకాయలు తీస్కో అంటీ... చాలా లేతగా ఉన్నాయ్ ..." అంది అవ్వ బోసినవ్వు నవ్వుతూ.

మీనాక్షి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయ్.

"వద్దవ్వా... వద్దు... ఇంకచాలు" అని గద్గద స్వరంతో అని అవ్వకి ఎంత డబ్బులు ఇవ్వాలో లెక్కచూసి ఇచ్చేసింది.

బజార్లో అమ్ముకునే ప్రతి ఒక్కరూ అంటీ అంటీ అనే సంబోధిస్తుంటే మీనాక్షికి చాలా దుఃఖం, కోపం కలిగాయ్.

చివరికి టిక్లీలు అమ్మే కుర్రాడొకడు మీనాక్షి కాళ్ళకి అడ్డంపడి "అంటీ... బొట్లు తీస్కుంటావా?" అని అడిగేసరికి మీనాక్షికి చాలా కోపం వచ్చేసింది. "ఏరా, నేను నీకు అంటీనా? అసలు అంటీ అంటే అర్థం తెల్సా?" అని అడిగింది వాడి చెవి మెలేస్తూ.

"అదేంటమ్మా? ... ఆడాళ్ళని ఆంటీ అనే కదా పిలుస్తారు" అన్నాడు వాడు బిక్కమొహంవేస్తూ.

వాడిని వదిలిపెట్టి ఇంటిదారి పట్టింది మీనాక్షి.

ఇంటికెళ్ళి కొన్న కూరగాయలు ఫ్రిజ్‌లో సర్దుతుంటే బయటినుండి ఎవరో "ఆంటీ... ఆంటీ..." అంటూ అరవడం మొదలుపెట్టారు.

"అబ్బా!... చంపుకు తినేస్తున్నారు కదా... వీళ్ళ ఆంటీ మండా..." అని విసుక్కుంటూ వెళ్ళి వీధి తలుపులు తీసింది.

అక్కడ ఉన్నవాడిని చూసి షాక్ తింది మీనాక్షి. ఓ బిచ్చగాడు బొచ్చె పట్టుకుని నిల్చున్నాడు.

"ఓ ముద్దెయ్యి ఆంటీ... ఆకలేస్తుండాది" అన్నాడు వాడు.

మీనాక్షి అంటే వెనక్కి విరుచుకు పడిపోయింది.

***

(ఓసారి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర నా వెహికిల్ ఆపితే ఓ బిచ్చగత్తె నన్ను అంకుల్ అని పిలుస్తూ బిచ్చమెత్తుకుంది. ఆ ప్రేరణతో రాశాను ఇది. -రచయిత)

* * *